టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగు చూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

బీఎస్ఎన్ఎల్

సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెల లోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మాడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాప్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటిరీయల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.

రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝుళిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంత కంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు		
సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	**1013**	**35.72**

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరికొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

హెచ్‌సీఏ టోర్నీలో పాలమూరు శుభారంభం

విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 28 : వరంగల్‌లో శనివారం నుంచి ప్రారంభమైన హెచ్‌సీఏ బాలుర అండర్-19 క్రికెట్ టోర్నీలో ఉమ్మడి పాలమూరు జట్టు శుభారంభం చేసింది. వరంగల్‌లో జరిగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు 34పరుగుల తేడాతో వరంగల్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అవంచ లక్ష్మణ్ 38 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జిల్లా జట్టు 29.4 ఓవర్లలో 87 పరుగులకే ఆలౌట్ అయ్యింది. పాలమూరు బౌలర్ ఎండీ ఉద్దిన్ 17 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. ఈ సందర్భంగా ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోచ్ గోపాలకృష్ణ, అబ్దుల్లా అభినందించారు.

న్యాయం చేయాలని తాసీల్దార్‌కు వినతి

తాసీల్దార్‌తో మాట్లాడుతున్న బాధితులు

దేవరకద్ర, సెప్టెంబర్ 28 : మండల కేంద్రంలోని మల్లయ్యపాపయ్య కుంట సమీపంలో ఇండ్లు నిర్మించుకున్న 50కుటుంబాలకు నివాసులు శనివారం తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. మల్లయ్యపాపయ్య కుంట సమీపంలో ప్రైవేట్ స్థలంకు సంబంధంలేదని.. అధికారులు వచ్చి తిరుగుతుండడంతో అనుమానంతో తమకు న్యాయం చేయాలని తాసీల్దార్‌ను కోరారు. కుంటలో ఎంత విస్తీర్ణంలో ఉందో సర్వే చేయించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలం

ఊట్కూర్‌లోని అంగన్‌వాడీ టీచర్ ఇంటి పెరటిలో వికసించిన బ్రహ్మ కమలాలు

ఊట్కూర్, సెప్టెంబర్ 28: మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి బ్రహ్మ కమలం వికసించింది. మొట్కూర్ వీధిలోని అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ ఇంటి పెరటిలో బ్రహ్మ కమలాలు ఒకే మొక్కకు 11 పుష్పాలు వికసించడంతో ఆనందం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ఇంటి యజమానితోపాటు కాలనీ మహిళలు బ్రహ్మ కమలాలను దర్శించుకుని పూజలు చేశారు.

క'న్నీటి' కష్టాలు

దేవరకద్ర, సెప్టెంబర్ 28: నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రం సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో దేవరకద్ర మండలంలో వారం రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయి గ్రామాల్లో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. దేవరకద్ర, జీన్గుర్రాల, గుడిబండ, గూరకొండ, గోప్లాపూర్, వెంకటాయపల్లి, బస్వాపూర్ తదితర గ్రామాల్లో జీపీ కార్యదర్శులు ఒక్కోరోజు ఒకవార్డులో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా.. ప్రజలకు సరిపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో నీటిట్యాంకర్లు తీసుకొచ్చినప్పుడు సరిపోకపోవడంతో వ్యవసాయ బోరు బావుల దగ్గరకు వెళ్లి తెచ్చుకుంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాలనీలకు సరిపడా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.

దేవరకద్రలో ట్యాంకర్ల నుంచి నీటిని తీసుకుంటున్న ప్రజలు

కోయిల్‌సాగర్‌లో ట్యాంకర్‌ద్వారా నీటిని పట్టుకుంటున్న జనం

పీపీగా బాలస్వామి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 28 : మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలస్వామికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా షాద్‌నగర్ ఫోక్స్ కోర్టు, షాద్‌నగర్ సబ్ కోర్టు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మాజీ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అనంతరెడ్డి, న్యాయవాదులు అభినందించారు.

గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 28 : గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు రామునాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో గల గిరిజన భవనంలో గిరిజన ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామునాయక్ మాట్లాడుతూ.. లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ మహబూబ్‌నగర్‌కు వస్తున్న సందర్భంగా ఆయనకు సమస్యలను తెలిపి పరిష్కారానికి కృషి చేసేలా చూస్తామన్నారు.

ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 28: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వాలు శ్రమదోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలన్నారు. బడ్జెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగ కార్మికులకు ప్రతినెలా వేతనాలు ఇవ్వడంలో ఏజెన్సీలు బాధ్యత వహించాలన్నారు. పీఎఫ్‌ను రెగ్యులర్‌గా చెల్లించాలన్నారు. ధర్నాకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి మద్దత్తు తెలిపారు. అనంతరం కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జోషి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులు వనిత, సాయిలు, నరేశ్, హన్మంతు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 28 : జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో శనివారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఎస్‌జీఎఫ్ పోటీలను నిర్వహించారు. డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విలియం, అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అండర్-14,17 విభాగాల్లో 25 పాఠశాలల నుంచి 300మంది బాలబాలికలు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, షాట్ పుట్, లాంగ్‌జంప్ పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నారాయణపేట, సెప్టెంబర్ 28: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో బాలాజీ అన్నారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్ 14, 17 టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో బాలాజీ హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తనకు నచ్చిన క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు, పీఈటీలు రమణ అనిత, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు

మరికల్, సెప్టెంబర్ 28: క్రీడాలతో స్నేహసంబంధాలు పెరుగుతాయని సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14,17 బాలబాలిక క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యాక్రమంలో తాసీల్దార్ జమీల్, ఎంపీడీవో కొండన్న, ఏస్సై మురళి, హెచ్ఎం నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 28: మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, హ్యాండ్ గ్లౌస్, జాకెట్లు తదితర రక్షణ పరికరాలు పంపిణీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. కార్మికులు పారిశుధ్య పనులు చేసే సమయంలో రక్షణ పరికరాలు విధిగా వాడాలన్నారు. అదేవిధంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, ఈఈ భరత్, కార్మికులు, విద్యార్థులు తదితులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

నారాయణపేట, సెప్టెంబర్ 28: పట్టణంలోని పీఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ దవాఖానలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. డీఎస్పీ లింగయ్య ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో దాదాపు రూ.2500విలువైన బీఎమ్‌డీ పరీక్షను 150మంది రోగులకు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

వ్యవసాయ మార్కెట్ కార్యవర్గం ఎన్నిక

నవాబ్‌పేట, సెప్టెంబర్ 28 : మండల వ్యవసాయ మార్కెట్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హరలింగం, వైస్ చైర్మన్‌గా విస్లావత్ తులసీరాంనాయక్, డైరెక్టర్లుగా నరేశ్, పద్మమ్మ, నర్సింహులు, వెంకటేశ్, శంకర్‌నాయక్, ప్రభాకర్, లాలయ్య, పురుషోత్తంరెడ్డి, ఎండీ జమీరుద్దీన్, శివకుమార్, చంద్రకాంత్, రాఘవేందర్‌ను ఎన్నుకున్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

భూత్పూర్.మక్తల్/మరికల్, సె